

# మ్యూజికల్ మ్యూజింగ్స్

## - కస్తూరి మురళీకృష్ణ

గుజర్ గయా వొ జమానా కైసా, కైసా,
హసీ ఖుషీకీ బహార్ థి జిస్మే
గుజర్ గయా వో జమానా కైసా.

విశ్వంలోని ప్రాణులన్నిటిలోకీ 'జ్ఞాపకాలు' ఉండే ఏకైక జీవి మనిషి. ఇతర జీవులకు, జంతువులకు గుర్తుంటుంది కానీ జ్ఞాపకాలుండవు. యజమానిని గుర్తుపడతాయి. ఆహారం ఉంచే గిన్నెను గుర్తిస్తాయి. కానీ మనిషిలాగా గతాన్ని నెమరువేయలేవు. మనిషిలా గతాన్ని గుర్తుతెచ్చుకోలేవు. గతంలోని అనుభూతులను స్మరించలేవు. ఆనందానుభూతులు అయితే ఆనందించలేవు. గతంలోని ఆనందాన్ని తలచుకుని వర్తమానంతో పోల్చుకుని దుఃఖించలేవు. ఆ అందమైన గతం ఎక్కడికి పోయిందని బాధపడలేవు. గతాన్ని తలుచుకుని వగస్తూ, ఆ ఏడుపువింటూ విషాదంలోనూ ఆనందాన్ని అనుభవించగల ఏకైక జీవి మనిషి. ఒక రకంగా మనిషికి ఇది వరం. ఇది శాపం.

1940లో విడుదలయిన డాక్టర్ సినిమాలో పంకజ్ మల్లిక్ పాడిన ఈ పాట వింటుంటే పలు రకాల ఆలోచనలు మనస్సులో మెదులుతాయి. ఇలాంటి పాటలు ఏమైపోయాయి మన సినిమాల్లోంచి? అన్న ఆలోచన మొదలౌతుంది. వాయిద్యాల ఆడంబరం లేదు. పదాల వాడకంలో ఎలాంటి సంక్లిష్టత లేదు. మామూలు పదాలు. పాట బాణీలోనూ ఎలాంటి ఆర్భాటం లేదు. పాట చిత్రీకరణలోనూ జిమ్మిక్కులు లేవు. ఎలాంటి ఆడంబరాలు లేవు. సాంకేతిక పరిజ్ఞానాన్ని అనవసరంగా ప్రదర్శించటంలేదు. కేవలం పాట ఉంది. పదాలున్నాయి. భావాలు పలికే స్వరం ఉంది .ఆవేదనను ప్రదర్శించే వదనం ఉంది. అంతే, అతి మామూలుగా అనిపించే పాట, పాటలోని పదాలు, భావాలు, పెద్దగా నాటకీయత, మెలోడ్రామా లేని నటన మనల్ని మరో లోకానికి తీసుకుపోతాయి. ఎంత విచిత్రం ఇదీ. ఎంత అద్భుతం ఇది.

గడచిపోయిన ఆ కాలం ఎలాంటిది? ఆ కాలం ఎలా గడిచిపోయింది అని ఆశ్చర్యపోతున్నాడు మనిషి. కాలం ఎలా గడుస్తుంది? కాలానికి కాళ్లున్నాయా? . కాలం వాహనం ఏమిటి? అసలు కాలం ఎలా గడచిపోతుంది? చూస్తూ చూస్తూ గంటలు, రోజులవుతాయి. రోజులు నెలలవుతాయి. నెలలు సంవత్సరాలవుతాయి. సంవత్సరాలు జీవితకాలం అవుతుంది. వ్యక్తికి కాలం ఎలా గడుస్తుందో తెలియదు. ఎలా ఆగిపోతుందో కూడా తెలియదు. కానీ చూస్తూ చూస్తూ భవిష్యత్తు వర్తమానం అయిపోతుంది. వర్తమానం గతం అయిపోయింది. 'అప్పుడే కాలం అయిపోయిందా?' అని ఆశ్చర్యం కలుగుతుంది. 2019 సంవత్సరం ఇంకా ఆరంభించినట్టేలేదు, అప్పుడే నవంబర్ నెల వచ్చేసింది. కనుమూసి తెరిచేలోగా 2020 వచ్చేస్తుంది. 2021లోకి మారిపోతుంది.

సుబహ అతీహై, షాం జాతీహై
సుబహ ఆతీహై, షాం జాతీ హైయూహీ
వక్త్ చల్తా హి రహతా హై రుక్తానహీ
ఏక్ పల్ మే యె ఆగె నికల్ జాతాహై
ఆద్మీ ఠీక్ సే దేఖ్ పాతా నహీ
ఔర్ పర్ దేపె మంజర్ బదల్ జాతాహై

ఎక్ బార్ చలే జాతా హై జో దిన్ రాత్,సుబహ-ఓ-షాం

వో ఫిర్ నహి ఆతే. వో ఫిర్ నహీ ఆతే...

'ఆప్ కీ కసం' సినిమాలో రాజేష్ ఖన్నా పై అత్యద్భుతంగా చిత్రితమైన ఈ పాటను రాసింది ఆనంద్ బక్షీ. సంగీతం కూర్చింది ఆర్. డి. బర్మన్. గీత రచనలో ఆనంద్ బక్షీ అత్యుత్తమ సృజనాత్మకతను ప్రదర్శిస్తున్న కాలంలో వచ్చిన పాట ఇది. అప్పటికి అమితాబ్ ఇంకా హిందీ సినీ ప్రపంచాన్ని పూర్తిగా ముంచెత్తలేదు. అప్పుడప్పుడే అమితాబ్ గాలి వీయనారంభిస్తోంది. రాజేష్ ఖన్నా పతనం ప్రారంభం అయింది. అంటే హిందీ సినిమా గీతాలలోంచి రొమాన్స్, సున్నిత భావనలు ఇంకా తొలగని కాలం అన్నమాట. సినిమాలలో పాటల ప్రాధాన్యం ఇంకా పూర్తిగా తగ్గని కాలం అన్నమాట. బహుశా ఆర్డీబర్మన్ సృజించిన పాటలలో అత్యంత సృజనాత్మకమైన గీతాలలో అగ్రస్థానంలో ఉంటుందీ గీతం 'జిందగీ కి సఫర్ మే గుజర్ జాతె హై జో ముకాం, వోఫిర్ నహి ఆతే' జీవితంలో ఒక్కసారి ఒకస్థానాన్ని, ఒక జాగాని దాటేము అంటే అది వెనక్కు తిరిగి రాదు అంటూ ఆరంభవముతుంది పాట. అంతే. జీవితంలో ఒకేసారి ఇరవై ఏళ్ల ఒకరోజు వయసులో ఉంటాం. అది వెనక్కు తిరిగి రాదు. ఇది ప్రతిక్షణానికీ వర్తిస్తుంది. ఇలా ఆరంభమయిన పాట పగలు వస్తుంది. రాత్రి పోతుంది. ఇలాగే పగలు వస్తుంది. రాత్రి పోతుంది. కాలం నడుస్తూనే ఉంటుంది. ఆగదు. చూస్తూ చూస్తూ తెరపై దృశ్యం మారిపోతుంది. మనిషి ఈ మార్పును గ్రహించలేదు. సరిగ్గా చూడలేదు. చూస్తూ చూస్తూ కాలం ముందుకు వెళ్లిపోతుంది. ఒక్కసారి వెళ్లి పోయిన రాత్రికానీ పగలుకానీ మళ్లీ రావు.అంటూ క్షణ భంగురమయిన జీవన గతిని, కరగిపోతే తిరిగిరాని కాలం లక్షణాన్ని చూపిస్తూ సాగుతుంది.. డాక్టర్ సినిమాలో ంటూ క్షణ భంగురమయిన జీవన గతిని, కరగిపోతే తిరిగిరాని కాలం లక్షణాన్ని గ్రహించి 'గుజర్ గయా వొ జమానా కైసా, కైసా' అని ఆశ్చర్యపోతున్నాడు.

డాక్టర్ సినిమాలో నాయకుడు ఆదర్శవాది. తండ్రిని వ్యతిరేకించి తనకు నచ్చిన అమ్మాయిని పెళ్లి చేసుకుని వేరు వచ్చేస్తాడు. వారి సంతానానికి జన్మనిస్తూ ఆమె మరణిస్తుంది. దాంతో పిల్లవాడికి నిజం చెప్పకుండా నాయకుడి తండ్రి, అంటే, తాత దగ్గరకు చేరుస్తారన్నమాట. ఇదంతా తలచుకుంటూ ఒంటరిగా మిగిలిన నాయకుడు సుఖసంతోషాల ఆ కాలం ఎలా వెళ్లిపోయింది? అని గతాన్ని తలచుకుని ఆశ్చర్యపోతున్నాడు. ' 'గుజర్ గయా వో జమానా కైసా? కైసా?' పంకజ్ మల్లి స్వరంలో ఈ పదాలు వింతఅర్థాన్ని, విషాదాన్ని, ఆశ్చర్యాన్ని సంతరించుకున్నాయి. 'గుజర్ గయా' అని ఆరంభించగానే ఎదఝల్లుమంటుంది. కైసా? కైసా? అని అడుగుతూంటే గుండె మెలిపెట్టినట్టవుతుంది. గతాన్ని తలచుకుని విలిపించే హృదయవేదన అనుభవానికి వస్తుంది.

పూల్ తమన్నావోం కె జిస్మే

కదం కదం పర్ ఖిల్తే థే

అబ్ వో హీ రాస్తా ఉజ్డా బన్ హై

జి స్పే హై ఆనా జానా

కైసా? కైసా?

అడుగడుగునా ఆశల పూలు విరబూస్తూండేవి. అదే దారి ఇప్పుడు ఎండిపోయిన తోటలా మారింది. ఎలాగ? ఎలా?

మేరే కదం జహా పడే

సజ్దే కి యే థ యార్ నే

ముఝ్ కో రులా రులా దియా

జాతీ హువీ బహార్ నే.

జానే కహా గయే వొ దిన్

కహతే థ తేరి రాహమే

నజ్రోంకొ హం బిఛాయేంగె

చాహే కహీ భి తుం రహో

చాహేంగె తుం కొ ఉమ్ర్ భర్

తుం కోన భూల్ పాయేంగె.

'మేరానాం జోకర్'లో హస్రత్ రచించగా శివరంజనీ రాగంలో శంకర్ జైకిషన్ అత్యద్భుతమైన రీతిలో రూపొందించిన ఈ పాటను ముఖేష్ ఎద కరిగి కన్నీరైపోయే రీతిలో పాడాడు. ఒకప్పుడు అడుగుపెట్టిన చోటల్లా వంగి ప్రణామాలు చేసేవారు. ఇప్పుడు వెళ్లిపోయే వసంతం వెక్కిరిస్తూ వెళ్తోంది. ఎక్కడికి పోయాయి ఆరోజులు? తన రాకకోసం ఒళ్లంతా కళ్లు చేసుకుని ఎదురు చూసేవారు? జీవితాంతం ఎక్కడ ఉన్నా నిన్నే ప్రేమిస్తూంటాను, నీకోసం ఎదురు చూస్తూంటాను అనే ఆ రోజులు ఎటు వెళ్లిపోయాయి? అని విలపిస్తున్నాడు నాయుకుడు.

హస్తా హువా ఎక్ రాజ్ హై జిస్ సే

కోనా కోనా రోషన్

ఐసా బుఝా కే, ఐసా బుఝాకే

దుబారా జిస్కో

మిన్నతే నహీ జలానా

కైసా? కైసా?

ఆ కాలం నాడు చిరునవ్వులతో అణువణువూ వెలుగుతో నిండేది. అంటే అంతా సుఖంగా సంతోషంగా ఉండేది. కానీ ఆ నవ్వుల వెలుగు ఇప్పుడు ఎలా ఆరిపోయిందంటే, ఎంత వేడుకున్నా వెలగదు. ఎలా మారిపోయింది కాలం ఇలా?

జబ్ తుం థ హమారి

ఔర్ హుం థ తుమ్హారే

వో థోడేసే దిన్ థ కిత్నె ప్యారీ

జోహం నె తుంహారే సంగ్ మె గుజారే

వో థోడేసే దిన్ థ కిత్నె ప్యారీ

మషాల్ (1950) సినిమాలో అశోక్ కుమార్ బంధువు అరుణ్‌కుమార్ అత్యంత మధురంగా పాడిన ఈ పాటను కవి ప్రదీప్ రచించాడు.

సంగీతం ఎస్డీ బర్మన్‌ది. వాయిద్యాలు అతి తక్కువగా ఉండి కేవలం గానానికి, బాణీకి, పాట భావానికి మాత్రమే ప్రాధాన్యం ఉన్న పాట ఇది. అత్యద్భుతంగా ఉంటుంది. గతాన్ని తలచుకుని బాధపడటం అంటే ఇదే అనిపిస్తుంది. కానీ అదీ మధురమైన బాధ. 'గతము తలచి వగచే కన్నా సౌఖ్యమే లేదు' అన్నది అనుభవానికి వస్తుంది ఈ పాట వింటూంటే. మషాల్ సినిమాలో నాయకుడి ప్రేమ విఫలమవుతుంది. ఆమె మరొకరిని వివాహమాడుతుంది. ఆమెతో కలసి గడిపిన కాలాన్ని తలచుకుని ఆ రోజు ఎంతటి ప్రియమైనవని బాధపడుతున్నాడు నాయకుడు. నువ్వు నాదానివి, నేను నీవాడిని అయిన ఆ కొద్దిరోజులు ఎంత ప్రియమైనవి అంటున్నాడు. నీతో కలసి గడిపిన ఆ కొన్నిరోజులు ఎంత అద్భుతమైనవి అంటున్నాడు.

దర్ద్ (1947) సినిమాలో నౌషాద్ ఆలీ బాణీకి ఇంకా యవ్వనం పూర్తిగా వికసించని, ప్రేమ భావన అనుభవానికి రాని సురయ్యా అత్యద్భుతమైన భావాలను స్వరంలో పలికించిన పాట 'హుం థె తుమ్హారే , హాయే వోభీ జమానా యాద్ కరో' నేను నీదాన్ని, నువ్వు నావాడివి అయిన కాలాన్ని గుర్తు తెచ్చుకో' మన ప్రేమను విఫలం కానీయకు అని పాడుతోంది నాయిక.

హుం థె తుమ్హారే ' పాటతో తమ కలయికను, ఆనాటి జ్ఞాపకాలను గుర్తుతెచ్చుకుంటూ నాయకుడు చివరలో అసలు విషయాన్ని ప్రస్తావిస్తాడు.

**తుం తోడ్ కె బంధన్ సారే**

**జాత్ హో పరాయె ద్వారే**

**హం బైఠే యహా హై మారే**

**సారే జీవన్ కీ బాజీ హార్**

**ఆజ్ పాగల్ మన్వా పుకారే**

**వో ధోడేసే దిన్ థె కిత్ నె ప్యారే.**

ఆమె అన్నీ మరచి, బంధనాన్ని త్రెంచుకుని పరాయి వాడిదయిపోతోంది. ఆమెని మరచిపోలేని అతడు జీవితంలో అన్నీ కోల్పోయి ఓడిపోయి ఉండిపోయాడు. అతడి మనస్సు గతంలో వారిద్దరూ కలసి ఉన్న ఆ తీయని కాలం, కొద్దికాలమే అయినా దాన్ని తలుస్తూ వగస్తోంది. చక్కని పాట. చిత్రీకరణ కూడా చాలా బాగుంటుంది. చాలా ఇన్‌టెన్స్ గా ఉంటుంది. అశోక్ కుమార్ ముఖంలో ప్రతిఫలించే భావనలు పాటలో ప్రతిఫలిస్తూంటే ఎంతో అద్భుతంగా అనిపిస్తుంది. ప్రతివ్యక్తి ఏదో రూపంలో విఫలమైన తన ప్రేమను తలచుకుని పాటలోని భావంతో స్పందిస్తాడు. అశోక్ పాత్రతో తాదాత్మ్యం చెందుతాడు.

ఇదే సినిమా మ్యాజిక్. వ్యక్తుల అనుభవానికి రాకున్నా వారి మనస్సులలో నిద్రాణమై ఉన్న సున్నితమైన భావనలను తట్టిలేపటం 'కళ' పని. తద్వారా వ్యక్తి సున్నితమనస్కుడై, తనలోని రాక్షసభావనలను, పశుత్వ భావనలను అణచిపెట్టి మానవుడిగా, మానవత్వంతో నిలుస్తాడు. ఇది 'ఉత్తమ' లక్ష్యం.

నిజానికి, ఏ వ్యక్తి అయినా తన అనుభవాల ఆధారంగా ప్రపంచాన్ని అర్థం చేసుకుంటాడు. తమ ఆశలు, నిరాశల ఆధారంగా ప్రపంచం గురించి తీర్మానిస్తాడు. కానీ 'కళ' వ్యక్తి అనుభవానికి రాని విషయాలను కూడా అతని అనుభవానికి తెచ్చి అతడి అనుభవాలను పరిపుష్టం చేస్తుంది.అతడిలో అతడికే తెలియని అనేక భావనలను తట్టిలేపుతుంది.

డాక్టర్ సినిమాలో పంకజ్ మల్లిక్ పాత్ర అనుభవాలు మన అనుభవాలు కావు. అతనిలా తండ్రిని ఎదిరించి వివాహం చేసుకున్న వాళ్ళు కానీ, ప్రసవించి భార్య మరణించటం కానీ సినిమా చూసిన ప్రేక్షకులెవరి అనుభవం కాదు. కానీ ఆ పాత్ర బాధను తమ బాధగా, పాత్ర సంతోషాలు తమ సంతోషాలుగా ప్రేక్షకులు అనుభవించేట్టు చేయటం ద్వారా ప్రేక్షకులను 'సహానుభూతి' పొందే స్థాయికి ఎదిగిస్తోందన్నమాట కళ. ఇందుకు దోహదపడతాయి పాటలు. అందుకే నాయకుడు ఒంటరిగా కూర్చుని 'గుజర్ గయా వో జమానా కైసా? ' అని పాడుతూంటే ప్రేక్షకులూ ఆ బాధను అనుభవిస్తారు. అనుభూతి చెందుతారు. తమ గతించిన కాలాన్ని తలచుకుని నిట్టూర్పులు విడుస్తారు. ఆ కాలం తిరిగి రాదని తెలిసి తీయని బాధను అనుభవిస్తారు.

యాద్ న జాయే బీతే దినోంకె

జాకేన ఆయె జోదిన్

దిల్ క్యూం బులాయె ఉసే?

దిల్ క్యూం బులాయే?

'దిల్ ఏక్ మందిర్' సినిమాలో గతాన్ని గుర్తుచేసుకుని నాయకుడు పడే వేదనాభరితమైన గీతం ఇది. గతకాలపు జ్ఞాపకాలు చెరిగిపోవటం లేదు. ఆ రోజు ఎంత గుర్తు చేసుకున్నా తిరిగిరావు. అలాంటి రోజులను ఎందుకని హృదయం పదే పదే గుర్తు చేసుకుంటోంది? ఎందుకని పదే పదే ఆ రోజులు వస్తే బాగుంటుందని, రమ్మని వాటిని పిలుస్తోంది? సమాధానం లేని ప్రశ్న. శైలేంద్ర రాసిన ఈ పాటకు శంకర్ జైకిషన్ సంగీత దర్శకత్వంలో మహమ్మద్ రఫీ హృదయంతో గానం చేశాడు. పాట భావాన్ని తాను అనుభవిస్తూ మన మనసు ఆ అనుభూతితో స్పందించేటట్టు చేస్తాడు. నాయిక వేరే అతడిని వివాహమాడుతుంది. ఆమె ఫోటో చూస్తూ హీరో గతాన్ని తలచుకుని బాధతో పాటపాడతాడు. ఈ సందర్భంలో శైలేంద్ర కూర్చిన భావాలు, రఫీ స్వరంలో ప్రాణం పోసుకుంటే కీరవాణి రాగంలో బాణీ మార్చి శంకర్ జై కిషన్ బంగారానికి తావి అద్దారు.

**దిన్ జో పఖేరూ హోతే**
**పింజరేమే మైన్ రఖ్ లేతా**
**పాల్తా ఉంకొ జతన్ సే**
**మోతేకె దానే దేతా**
**సీనేసే రహతా లగాయే**
**ఎంత అందమైన ఊహ.**

గతం తిరిగి రాదని తెలుసు. ఒక్క క్షణం కూడా వెనక్కు తిరిగిరాదని తెలుసు. కానీ అసంభవాన్ని సంభవంగా భావించి ఆ ఊహను నిజంగా భావించి ఊహల మేడలు కట్టటంలో ఉన్న సంతృప్తి నిజంగా గతం తిరిగి వచ్చినా కలగదు. ఎందుకంటే, గతం తిరిగి వచ్చినా, దాన్ని అలాగే అనుభవించటానికి మనం గతంలోలా ఉండము కదా! గతం రోజులు పక్షులయితే వాటిని పంజరంలో బంధించి ప్రేమగా పెంచుతాడట. హృదయంలో దాచుకుంటాడట. రోజులు పక్షిగా మారటం, పంజరంలో బంధించటం...శైలేంద్రకే చెల్లింది ఇలా రాయటం.

**తస్వీర్ ఉన్‌కి చుపాకర్**
**రఖ్ దూజహా జీ చాహే**
**మన్ మే బసీ యే మూరత్**
**లేకిన్ మిటే న మిటాయే**
**కహనేకో హై వో పరాయే**

ఆమె చిత్రపటాన్ని ఇష్టమైన చోట దాస్తాడట. మనస్సులో ప్రతిష్ఠితమైన ఆమె రూపం ఎంత తొలగించాలన్నా తొలగటం లేదట. పేరుకి మాత్రమే ఆమె పరాయిది కానీ అతని హృదయంలో ఆమె రూపం చెరగటంలేదు. అంటే పేరుకి పరాయిది కానీ నిజానికి ఆమె అతడిది. ఇక్కడే పాటలో మానవ మనస్తత్వాన్ని అతి సున్నితంగా ప్రదర్శించాడు శైలేంద్ర.

ఇద్దరూ ప్రేమించుకున్నారు. ఆమెకి పెళ్లయిపోయింది. ఆమె పరాయిది అయిపోయింది. కానీ ఆమె పరాయి అని అతని హృదయం ఒప్పుకోవటం లేదు. కానీ, ఆమె పెళ్లయిన మరుక్షణం, గతాన్ని మరచిపోవాలని ప్రయత్నిస్తూ కొత్త జీవితం ప్రారంభించింది. ఇప్పుడు ఆమెకు భర్తనే సర్వస్వం. ఆమె ప్రియుడు ఆమెకు పరాయివాడు. ఇక్కడ నాయకుడు ఆమె 'పరాయిది పేరుకే' అంటున్నాడు. కానీ ఆమె భర్తతో 'హం తేరే ప్యార్ మె, సారా అలం ఖోబైఠే ' అని పాడుతుంది. 'అంటే నీ ప్రేమలో సర్వ ప్రపంచాన్ని నేను విస్మరించాను. వదిలేశాను ' అని అర్థం.

పురుష ప్రేమకూ, స్త్రీ ప్రేమకూ ఉన్న సున్నితమైన తేడాను అత్యద్భుతంగా చూపించాడు శైలేంద్ర. నిజానిజాలతో స్త్రీ రాజీ పడినంతగా పురుషుడు రాజీపడలేదు. అందుకే

కే జైసే తూ ముఝే చాహేంగి ఉమ్రభర్ యూహీ
ఉఠేగీ మేరీ తరఫ్ ప్యార్ కీ నజర్ యూహీ
మైన్ జాంతాహు కే తూ గైర్ హై మగర్ యూహీ

అని ఒక పురుషుడే అనగలడు పరాయిదానివైనా, నువ్వు జీవితాంతం నన్ను ప్రేమిస్తున్నట్టు, నీ ప్రేమ దృక్కులు నాపై ప్రసరిస్తున్నట్టు, నువ్వు పరాయిదానివైనా నన్నే ఇష్టపడుతున్నట్టు నా హృదయం ఆలోచిస్తూంటుంది అని పురుషుడే అనగలడు. ఇలాంటి పరిస్థితిలో ఒక యువతి ఎలా స్పందిస్తుంది?

ఇద్దరూ ప్రేమించుకున్నారు. కానీ వారిద్దరూ ఇప్పుడు పరాయివారైపోయారు.

మైన్ జబ్ భి అకేలీ హోతీ హూ
తుం చుప్ కేసే యాద్ ఆతీహై
ఔర్ ఝూంకె మేరీ ఆఖోంసే
బీతేదిన్ యాద్ దిలాతీహో

ధర్మపుత్ర సినిమాలో నాయిక నాయకులు వేరౌతారు. అప్పుడు అతడిని తలచుకుని ఆమె పాడే గీతం ఇది. సాహిర్ ఎంత అద్భుతంగా గీతాన్ని రచించాడో, అంత సున్నితమైన బాణీని ఎన్. దత్త సృజించాడు. ఆమె ఒంటరిగా ఉన్నప్పుడు, అతడు జ్ఞాపకానికి వస్తాడట. ఆమె కళ్లల్లోకి తొంగి చూస్తాడట. గతాన్ని తలపుకు తెస్తాడట. అద్భుతమైన భావం. కళ్లల్లోకి తొంగి చూసి గతాన్ని తలపుకు తేవటం' ఇలాంటి భావం ఒక్క సాహిర్ మాత్రమే రాయగలడు.

మస్తాన హవా కె ఝోకోసె హర్ బార్ వో పర్దే కా హిల్‌నా
పర్దేకొ పకడ్ నే కీ ధున్‌మె దో అన్‌జాన్ హాథోం కా మిల్‌నా
ఆంఖోమె ధువాసా ఛాజానా, సాసోమే  మె సితారే సే ఖిల్‌నా.

దృశ్యాన్ని కళ్లకు కట్టినట్టు చిత్రిస్తున్నాడు. శైలేంద్ర అందమైన ఊహను సృజించి మనసును మురిపిస్తే సాహిర్ అందమైన సంఘటనను కళ్లముందు నిలిపి ఎదను గిలిగింతలు పెడుతున్నాడు.

వేగంగా వీచే గాలి వల్ల మాటిమాటికీ పరదా కదలుతూంటే, ఆ పరదాను కదలకుండా ఆపాలని ప్రయత్నించిన ఇద్దరు అపరిచితుల చేతులు కలిశాయట. దాంతో కళల్లో పొగ కమ్మటం అంటే మైకం కమ్మటం, ఊపిరిలో తారలు వికసించాయట. ఇక్కడ సాహిర్ చేసిన చమత్కారం కళ్లల్లో పొగ కమ్మటం అంటే మైకం కమ్మటం, ఊపిరిలో తారలు విరియటం. అద్భుతమైన భావన.

ముడ్ ముడ్ కె తుమ్హారే రస్తేమే తక్ నా వో ముఝె జాతే జాతే
ఔర్ మేరా రిఠక్‌రుక్ జానా చిల్ మన్ కె కరీబ్ ఆతే ఆతే
నజ్ రోం కా తరస్‌కర్ రహ జానా ఎక్ ఝలక్ పాతే పాతే

అమె వెళ్తూ వెళ్తూ అతని దారిలో ఆగి ఆగి అతడిని తిరిగి తిరిగి చూడటం, అతడిని చూసి పరదా మాటున కంపిస్తూ ఆమె ఆగిపోవటం, అతడిని ఒక్కసారి చూడాలని, చూస్తూ చూస్తూ ఆమె కళ్లు కాయలు కాయటం. ఇదంతా అతడు ఆమెకు జ్ఞాపకం చేస్తున్నాడట.

**బాలోంకే సుఖానే నే కీ ఖాతిర్ కోఠే పె వో మెరా ఆజానా**

**ఔర్ తుం కో మూకాబిల్ పాతే హీ కుఛ్ షర్మానా, కుచ్ బల్ ఖానా**

**హం సాయో కె డర్ సే కతరానా ఘర్ వాలోం కె డర్ సె ఘబ్రానా..**

కురులు ఆరవేసేందుకు ఆమె ఇంటిపైకి రావటం, అక్కడ అతను ఎదురుబడగానే సిగ్గుపడటం, వగలు పోవటం, చెలికత్తెల భయంతో దాక్కోవటం, ఇంటివాళ్ల భయంతో గాభరా పడటం ఇవన్నీ అతను ఆమె ఒంటరిగా ఉన్నప్పుడు ఆమె కళ్లల్లోని తొంగి చూసి జ్ఞాపకం తెస్తున్నాడట.

**బర్సాత్ కె భీగీ మౌసం మే సర్దీకి ఠిఠర్‌తీ రాతోమె**

**పహరో వోయూ హీ బైఠే రహనా హాథోంకొ పకడ్ కర్ హాథోమే**

**ఔర్ లంబీ లంబీ ఘడియోంకా కట్ జానా బాతో బాతోమే.**

వర్షకాలంలో, చలికి వణికించే రాత్రుల్లో, గంటల తరబడి చేతిలో చేయివేసుకుని ఇద్దరూ కూర్చుని ఉండిపోవటం, మాటలలో గంటలు గంటలు గడిపేయడం, అతను ఆమెకు జ్ఞాపకానికి తెచ్చాడట.

**రోరోకె తుమ్హే ఖత్ లిఖతీ హు ఔర్ ఖుద్ పఢకర్ రో లేతీహూ**

**హాలాత్ కి తప్ తే తూఫాన్ మె జజ్బాత్ కి కష్తీ ఖేతీహూ**

**కైసె హో, కహాహో కుఛ్ తో కహో, మై తుం కొ సదాయే దేతీహూ**

ఏడుస్తూ కన్నీళ్లతో నీకు ఉత్తరం రాస్తాను. రాసింది నేనే చదువుకుంటూ ఏడుస్తాను. ఈ విషాద పరిస్థితుల తుఫానును మనసులోని భావనల నౌకతో ఎదుర్కుంటున్నది. ఎలా ఉన్నావు? ఎక్కడ ఉన్నావో కొంచెం చెప్పమని నిన్ను అభ్యర్థిస్తున్నాను. వేడుకుంటున్నాను.

ఇదీ పాట. ఇది పాటనా? సున్నితమైన భావాల ప్రకటనా? అనిపిస్తుంది. ఈ పాటలో వారిద్దరూ కలవటం, వారి కలయిక, స్నేహంగా, ప్రేమగా పరిణమించటం, వారు దూరమవటం వరకూ మొత్తం అత్యంత అద్భుతమైన రీతిలో అతి సున్నితంగా వర్ణించాడు సాహిర్. ఇవన్నీ అతను ఆమెకు గుర్తుకు తెస్తున్నాడనటంతో, అతడు ఆమెని మరచిపోయాడు, ఆమె అతడిని మరచిపోవాలని ప్రయత్నిస్తున్నా, అతడితోని అందమైన అనుభవాలు, సున్నితమైన భావనలు, సున్నితమైన భావనలు ఆమెను మరచిపోనివ్వటం లేదన్న అతి సున్నితంగా తెలుపుతున్నాడు కవి. అందుకే బాణీతో, గాయనితో సంబంధం లేకుండా పాట కేవలం పదాలతో, పదాల భావాలతో ప్రత్యేక అస్థిత్వాన్ని సాధించుకుంది. సాధారణంగా సినిమా పాటలలో వాడని, కవిత్వంలో వాడే పదాలను సాహిర్ అలవోకగా పాటలో పొదిగి మెప్పించాడు.. 'జజ్బాతీ కష్తీ' అంటే సున్నిత భావాల పడవ పరిస్థితుల వల్ల ఏర్పడిన భయంకరమైన తుఫానులో చిక్కుకుందట. ఎంత అత్యద్భుతమైన భావప్రకటన. ఇలాంటి భావాలను పద బంధాలను సినిమా పాటలలో వాడటం వల్ల సామాన్యులకు సైతం అందమైన పదాలు తెలియటమే కాదు వారి ఆలోచనా స్థాయి, సున్నితత్వం పెరుగుతుంది. కళాకారులు చేయాల్సిన పని ఇది. ప్రేక్షకులు కోరింది ఇచ్చి మెప్పించటంలో గొప్పలేదు. తనకు నచ్చింది ఇచ్చి మెప్పించటంలోనే కళాకారుడి ప్రతిభ దాగుంది.

ఇలాంటి సుందరమైన, సున్నితమైన భావనలను అత్యంత సుందరంగా పాటల్లో ప్రదర్శించి జ్ఞాపకాల పాటలకే తలమానికంగా నిలిచే పాటను సృజించాడు గేయ రచయిత రాజిందర్ క్రిషన్ 'సంజోగ్' సినిమాలో. తరచి చూస్తే రాజేందర్ కిషన్ ఆనాటి అగ్రశ్రేణి గేయ రచయితలకి ఏమాత్రం తీసిపోడు. శైలేంద్ర, సాహిర్, మజ్రూహ్, షకీల్, తనదైన ప్రత్యేకతను నిలుపుకుంటూ అత్యధిక సంఖ్యలో అత్యద్భుతమైన

గేయరచన చేశాడు. హిట్ పాటల సృజనకు కారకుడయ్యాడు. కానీ రాజేందర్ కిషన్‌ను అగ్రశ్రేణి గేయరచయితల జాబితాలో చేర్చకపోవటం సినీ విశ్లేషకులు, విమర్శకుల అపోహలకు, దురూహలకు నిదర్శనం

**వొ భూలీ దాస్తాన్ లోఫిర్ యాద్ ఆగయీ**

**నజర్ కే సాంనే ఘటా సీ ఛాగయీ**

మరచిపోయిన గాథ మళ్లీ గుర్తుకు వచ్చింది. కళ్లముందు గతం జ్ఞాపకాల మేఘాలు కమ్ముకున్నాయి. నజర్ కే సామ్నే ఘటాసీ ఛాగయీ' అంటే కళ్లముందు మేఘాలు కమ్ముకున్నాయి అని అర్థం. కానీ కళముందు మేఘాలు కమ్మటం అంటే కళ్లు మసకబారటం. దానికి కారణం, గతం తాలుకు జ్ఞాపకాలు గుర్తుకు రావటం

**కహాసే ఫిర్ చలే ఆయె, యె కుఛ్ భట్ కె హువే సాయే**

**యె కుఛ్ భూలీహువే నగ్మే, జొ మేరే ప్యార్ నే గాయె**

**యె కుఛ్ బిఛ్‌డీ హువీ యాదే యె కుఛ్ టూటే హువే సప్నే**

**పరాయే హోగయేతోక్యా, కభీ యేభీతో థే అప్నే**

**నజానే ఇన్‌సె క్యా మిల్‌కర్ నజర్ షర్మాగయీ**

అద్భుతమైన గేయ రచన పద్ధతిది. కవిత్వాన్ని గేయాన్నీ మిళితం చేసిన గేయ కవిత్వం లేక కవిత్వ గేయం ఇది. ప్రతివాక్యంలో అద్భుతమైన పదబంధాలు, బావాలు, ప్రతీకలు, కవిత్వ చిత్రికలు పొదిగాడు కవి. 'భట్ కే హువే సాయే', సాయ అంటే నీడ. భట్ కి హువే అంటే దారితప్పిన. 'ఎక్కడినుంచి వచ్చాయీ దారి తప్పిన నీడలు' అంటోంది. ఆమె గతం జ్ఞాపకాల నీడలు అవి. అవి దారి తప్పాయి. అంటే ఆ గతం ఇప్పుడు ఆమెది కాదు. నీడలు అవటంతో ఆమెని వదలనివి అని అర్థం వొస్తుంది. అందుకే దారి తప్పిన నీడలు అంటోంది. ఆమెని వదిలివెళ్లాయి ఆమె నీడల్లాంటి గతం జ్ఞాపకాలు. కానీ ఎక్కడికి వెళ్తాయి? మళ్లీ వచ్చాయి. అందుకే ఎక్కడినుంచి వచ్చాయి ఈ దారి తప్పిన జ్ఞాపకాలు అని అడుగుతోంది. అవి మరచిపోయిన పాటలట, ఆ పాటలు పాడిందెవరు? ఆమె ప్రేమపాడిన పాటలవి.

ఆ పాటలను ఆమె ఇప్పుడు మరచిపోయింది. ఇప్పుడు ఆ పాటలు ఎక్కడినుంచి వచ్చాయి? అని అడుగుతోంది. అని ఆమెను వదిలి వెళ్లిన జ్ఞాపకాలు, పగిలిన ఆమె స్వప్నాలు.. ఇవన్నీ ఇప్పుడు ఎక్కడినుంచి వచ్చాయి? అంటోంది. ఇప్పుడు అవన్ని ఆమెవి కావు. పరాయివి అయిపోయాయి. పరాయివి అయితేనేం ఒకప్పుడు అన్నీ ఆమెవే. చివరి వాక్యం అత్యద్భుతం. వాటిని కలసి ఇప్పుడు ఆమె సిగ్గుపడుతోంది.

యవ్వనంలో, ముందూ వెనుకా చూడని ఉత్తేజంలో, ఉత్సాహంలో వ్యక్తి మైమరచి ప్రవర్తిస్తాడు. కానీ ఎదిగిన తరువాత, జీవితంలోని అనుభవాలు పాఠాలు నేర్పిన తరువాత గతాన్ని తలచుకుంటే సిగ్గు కలుగుతుంది. బాధ కలుగుతోంది. అందుకే గతంలో పాడిన ప్రేమ పాటలు, కన్న స్వప్నాలు, గడిపిన క్షణాలు గుర్తుకు వస్తే ఆమె మనస్సు సిగ్గుపడుతోంది.

**ఉమ్మీదోంకి హసీ మేలే, తమన్నావోంకే వోరేలే**

**నిగాహోంనే నిగాహోంసే, అజబ్ కుఛ్ ఖేల్ సా ఖేలే**

**హవామే జుల్ఫ్ లహరాయీ, నజర్ పే దేఖుదీ ఛాయీ**

**ఖులేథే దిల్‌కె దర్వాజే, మొహబ్బత్ భీ చలీ ఆయీ**

**తమన్నావోంకి దునియా పర్ జవానీ ఛాగయీ.**

మరో అద్భుతమైన చరణం. ఆశల అందమైన జాతరలట, కోరికల వరుసలట. అకాలంలో కళ్లు కళ్లతో ఒక విచిత్రమైన ఆటలు ఆడేయట. వెంట్రుకలు గాలికి ఎగిశాయి కళ్లముందు మైకం కమ్మింది. ఆమె హృదయపు ద్వారాలు తెరచుకున్నాయి. ప్రేమ ప్రవేశించింది. కోరికల ప్రపంచంపై యవ్వనం విజయం సాధించిందట. కోరికల ప్రపంచంపై యవ్వనం విజయం సాధించిందట. కోరికల ప్రపంచంపై యవ్వనం విజయం సాధించటం ఎంత గొప్ప భావ ప్రకటన. పై నాలుగు పాదాలలో యవ్వనంలోని తొలి ప్రేమలో ఉండే మైమరపు, పరవశం వంటివి వర్ణించాడు. చివరి పాదంలో ఆమె శరీరం మనసుపై విజయం సాధించిందని కుండబద్దలు కొట్టాడు. 'మొహబ్బత్ భీ చలి ఆయీ' అన్నప్పుడు ప్రేమ ఫలితమైన పిల్లవాడు నడచి వస్తాడు. 'తమన్నావోంకి దునియా పర్ జవానీ ఛాగయీ'

**బడే రంగీన్ జమానేథే, తరానే హీ తరానేథే**

**మగర్ అబ్ పూఛ్ తాహై దిల్, వొ దిన్ థే యా ఫసానే థే**

**ఫకత్ ఎక్ యాద్ హై బాకీ, బస్ ఎక్ ఫర్యాద్ హై బాకీ**

**వొఖుషియా లూట్ గయీ లేకిన్, లుట్ గయీ లేకిన్ దిల్-ఏ-బర్బాద్ హై బాకీ**

**కహాథీ జిందగీ మేరీ, కహా పర్ ఆగయీ!**

యవ్వనం తాలూకు పొరపాట్లు జ్ఞాపకాల పాటకు అత్యద్భుతమైన ముగింపునిచ్చాడు కవి. అందమైన కాలం అది. ఎటు చూసినా పాటలు, ఆటలే. కానీ ఇప్పుడు ఆమె హృదయం అడుగుతోంది అవి నిజంగా గడచిన దినాలా? కట్టు కథలా? అని. ఎందుకంటే ఇప్పుడు జ్ఞాపకాలు మిగిలాయి. ఇప్పుడు ఆనాటి జ్ఞాపకాల తాలూకు వేదనలు, ప్రార్ధనలు, ఏడుపులు మిగిలాయి. ఆనందాలు అన్ని పోయాయి. మిగిలింది దిల్-ఏ-బర్బాద్, నాశనం అయిపోయిన హృదయం. చివరకు అసలు ఎలాంటిది నా జీవితం? ఎలా అయిపోయిందీ అని బాధపడుతోంది ఆమె.

ఇదంతా ఆమెకు ఎందుకు జ్ఞాపకం వస్తుందంటే చాలాకాలానికి ఆమె తనకు దూరమైన ప్రియుడిని చూస్తుంది. పరుగు పరుగున ఇంటికి వస్తుంది. గతాన్ని తలచుకుని పాట పాడుతుంది.

'ముత్యాలముగ్గు'లో ఇలాంటి సందర్భంలోనే గుంటూరు శేషేంద్రశర్మ అత్యద్భుతమైన కవిత గేయం రచించాడు. పాటలో ఎక్కడా గతం, జ్ఞాపకాలు, కోల్పోయిన ప్రేమలాంటి పదాలు రావు. కానీ అతి అందమైన ప్రతీకల ద్వారా పరోక్షంగా ఆమె మనసులోని భావనలను, అతడిని చూసిన ఆనందాన్ని అత్యద్భుతంగా వ్యక్తపరుస్తాడు కవి. 'సంజోగ్' లోని పాటలో ఆమె గతాన్ని తలచుకుని సిగ్గుపడుతోంది. కానీ 'ముత్యాలముగ్గు'లో ఆమె అతడిని చూసి సంతోషిస్తోంది. నిదురించే తోటలాంటి ఆమె జీవితంలోకి, ఆమె హృదయంలోకి ఆనందాన్ని కలిగించే పాట ప్రవేశించింది. అంతవరకూ ఆమె అతను లేక నిదురించే తోటలాంటిది. పాట చైతన్యానికి ప్రతీక. పాట రావటంతోటే నిదురించిన తోటలాంటి ఆమె జీవితం చైతన్యవంతం అయింది.

**నిదురించే తోటలోకి పాట ఒకటి వచ్చింది.**

**కన్నుల్లో నీరు తుడిచి కమ్మటి కల ఇచ్చింది.**

**రమ్యంగా కుటీరాన రంగవల్లులల్లింది.**

**దీనురాలి గూటిలో దీపంగా వెలిగింది.**

**శూన్యమైన వేణువులో ఒక స్వరం కలిపి నిలిపింది**

**ఆకురాలు అడవికి ఒక ఆమని దయచేసింది**

అన్నీ అతడికి దూరమై స్థబ్దమైపోయిన ఆమె జీవితానికి, హృదయానికి ప్రతీకలే. అతని రాకతో అన్నీ చైతన్యవంతమయ్యాయి. కుటీరంలో రంగవల్లులు, గూటిలో దీపం, శూన్యమైన వేణువులో స్వరం, ఆకురాలు అడవికి ఆమని రావటం ప్రతీకాత్మకంగా అతను రాకముందు ఆమె జీవితాన్ని అతడు వచ్చాడని తెలిసిన ఆమె ఆనందకరమైన స్థితిని ప్రదర్శిస్తున్నాయి.

అయితే అతను ఆమె కోసం రాలేదు. ఆమె ఉనికి కూడా అతడికి తెలియదు. అతడు రావటంతో ఆమె ఏవేవో ఊహించింది. అతడు వెళ్లిపోవటంతో అన్నీ ఆవిరైపోయాయి.

**విఫలమైన నా కోర్కెలు వేలాడే గుమ్మంలో**
**ఆశల అడుగులు వినబడి అంతలో పోయాయి.**
**కొమ్మల్లో పక్షుల్లారా, గగనంలో మబ్బుల్లారా**
**నది దోచుకుపోతున్న నావను ఆపండి**
**రేవు బావురుమంటోందని నావకు చెప్పండి**

పాట చివరికి వచ్చేసరికి రోమాలు నిక్కపోడుచుకుంటాయి. నది దోచుకుపోతున్న నావ, రేవు బావురు మనటం...అద్భుతం. ఇలాంటి పాట ఇంకోటిలేదు. ఇకపై రాదు. ఎంత సున్నితమైన భావం. ఎంత అద్భుతమైన భావ ప్రకటనా పద్ధతి.

ఇలాంటప్పుడే అనిపిస్తుంది, ఏమైపోయింది ఆ సున్నిత భావనల కాలం? ఏమైపోయారు అలాంటి కళాకారులు? ఏవీ అలాంటి దృశ్యాలు, సందర్భాలు మన సినిమాల్లో? ఎలా కాలం మారిపోయింది? చూస్తూ చూస్తూ మనకు తెలియకుండా మన ప్రమేయం లేకుండా తెరపై దృశ్యం మారిపోయింది. 'జానె కహా గయే వో దిన్' అనుకుంటూ 'వో దిన్ థే యా ఫసానే థే' అని ఆశ్చర్యపోతూ. 'రేవు బావురుమంటోందని' కళాకారులకు చెప్పమని ప్రకృతిని, భగవంతుడిని ప్రార్థిస్తూ మనం ఇలా మిగిలిపోయాం. ఎలా? ఎలా? ఎలా?

**గుజర్ గయా వొ జమానా కైసా? కైసా? కైసా?**

## (మరిన్ని పాటలు వచ్చే నెలలో)

Post your comments